క్లుప్తంగా

చిన్నారులకు టీకాలతో ఆరోగ్యం



ఆలమూరులో చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు వేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు. పినపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజక్షన్లు అందజేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో నివారణ తదితర వ్యాక్సిన్లను వేశారు.

నేటి నుంచి సదరం స్లాట్ కేటాయింపు

ఆలమూరు: దివ్యాంగులకు గురువారం నుంచి సదరం సర్టిఫికెట్ స్లాట్ల కేటాయింపు జరుగుతుందని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ తెలిపారు. అర్హులైన, అవసరమైన దివ్యాంగులు సమీప గ్రామ సచివాలయాల వద్దకు వెళ్లి స్లాట్ సమయాన్ని బుక్ చేసుకోవాలన్నారు. మార్చి నెలాఖరు వరకూ ఈ స్లాట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. ఇతర వివరాల కోసం వైద్యారోగ్య సిబ్బందిని సంప్రదించాలని వారు విజ్ఞప్తి చేశారు.

మోదీ పాలనలో దేశాభివృద్ధి



పి.గన్నవరంలో క్యాలండర్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

పి.గన్నవరం: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకూరి గోపాలకృష్ణ అన్నారు. మన సంకల్పం, వికసిత్ భారత్ కార్యక్రమానికి సంబంధించిన క్యాలండర్లు, పుస్తకాలను బుధవారం పి.గన్నవరంలో సెంటర్లో బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు ఆరుమిల్లి వీరభద్రరావు, జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ చీకరమెల్లి గోపాలకృష్ణ, మండలశాఖ అధ్యక్షుడు యర్రంశెట్టి సాయిబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పథకాల అమలులో దేశంలోనే అగ్రస్థానం

- ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- నియోజకవర్గంలో 1487 మందికి నూతన పింఛన్లు



కొత్తపేటలో లబ్ధిదారులకు నమూనా చెక్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంతో పాటు అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన విధంగా పింఛన్ రూ.3,000కు పెంచగా మండలంలో గత నెల వరకూ 10,703 మందికి, కొత్తగా 124 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. మొత్తం 10,827 మందికి రూ.3,19,15,500 సొమ్ము పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి శ్రీకారం చుట్టారు. స్థానిక ఎంపీపీ కార్యాలయ ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో జరిగిన సభకు ఎంపీపీ మార్గన గంగాధరరావు అధ్యక్షత వహించగా ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా విప్లవాత్మక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ముఖ్యంగా సామాజిక పింఛన్ల విషయానికి వస్తే పింఛనుదారుడు చనిపోతే కొత్త పింఛన్ ఇచ్చే టీడీపీ విధానానికి వైఎస్సార్ ప్రభుత్వం స్వస్తి చెప్పి ఎంతమంది అర్హులుంటే అంతమందికీ పింఛన్లు మంజూరు చేశారన్నారు. ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ పంపిణీ విధానాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసి, 65 సంవత్సరాల వయో పరిమితిని 60 సంవత్సరాలకు తగ్గించి లబ్ధిదారుల ఇంటి వద్దే పింఛన్ అందజేస్తున్నారన్నారు. పారదర్శక పరిపాలనకు దేశంలోనే జగన్ ప్రభుత్వం చిరునామాగా నిలిచిందన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక తోడ్పాటునందిస్తుందన్నారు. 14 ఏళ్ల టీడీపీ హయాంలో పొందిన లబ్ధి ఎంత? నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో పొందిన లబ్ధి ఎంత? అని ప్రతి ఒక్కరూ ఆత్మ పరిశీలన చేసుకుని పేదల పక్షాన ఉన్న జగన్‌కు మద్దతిస్తారా? ధనికుల పక్షాన నిలిచిన పెత్తందారులకు మద్దతిస్తారా? మనస్సాక్షిగా నిర్ణయం తీసుకోవాలని ప్రజలను కోరారు. ఈ సభలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, వైస్ ఎంపీపీ బండారు సత్యమంగతాయారు, సర్పంచ్‌లు రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, వీబీపీ కన్వీనర్లు సాదు చెంచయ్య, దూనబోయిన శ్రీనివాస్, ఎంపీటీసీలు పేపకాయల బ్రహ్మానందం, దూళి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు ఆర్థికసాయం

ఇటీవల తుపాను, భారీ వర్షాలకు మండలంలో కూలిపోయిన 6 తాటాకిళ్లకు సంబంధించి రూ.10 వేలు చొప్పున, రెండు దూళ్ల పాకలకు రూ.2,100 చొప్పున ఆ బాధితులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రభుత్వ సాయం అందచేశారు.

పింఛన్ల పెంపుపై హర్షం

అయినవిల్లి: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఇచ్చే ఫించను రూ.3000 పెంచడమే నిజమైన పండగ అని ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో వైఎస్సార్ పింఛన్ కానుక సభకు ఎంపీపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ వారం రోజుల పాటు వైఎస్సార్ పింఛన్ కానుక పేరుతో గ్రామాల్లో వైఎస్సార్ పెంపు ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పింఛన్ రూ.3000 ఇవ్వడంతో పింఛన్‌దారులు సంక్రాంతి పండగకంటే ఆనందంగా జరుపుకొంటున్నారన్నారు. అనంతరం రూ.3000 పింఛన్‌ను పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, సర్పంచులు బొక్కా కామేశ్వరరావు, దాసరి శైలజ తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

మలికిపురం: స్థానిక కనకదుర్గ గుడి వద్ద ఈ నెల 5న జరిగే వైఎస్సార్ సీపీ బస్సుయాత్రను విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు అడబాల బ్రహ్మజీ కోరారు. బుధవారం మేడిచర్లపాలెం, మట్టపర్రు, గుడిమెళ్లంక, దిండి, రామరాజులంక గ్రామాల్లో ఈ మేరకు పార్టీ శ్రేణులతో సమావేశాలు ఆయన నిర్వహించారు.

రాజోలు: నియోజకవర్గంలో శుక్రవారం జరిగే వైఎస్సార్ సీపీ సాధికార బస్సు యాత్రకు వేలాదిగా దళిత, గిరిజన, బహుజనులు తరలి రావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తెన్నేటి కిషోర్ మాదిగ అన్నారు. బుధవారం కరవాకలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సమావేశంలో మాట్లాడుతూ, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగే బస్సుయాత్రను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పేటి రాజేష్, నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ నెరవేర్చిన ఏకైక సీఎం జగన్

కొత్తపేట: ఇచ్చిన హామీ.. చెప్పిన మాట నిలుపుకున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని బిళ్లకుర్రులో బుధవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వీధివీధినా లబ్ధిదారులు, మహిళలు, యువత జగ్గిరెడ్డిపై పూలవర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు. ప్రతి ఇంటా అక్కచెల్లెమ్మలను, అవ్వాతాతలను, అన్నదమ్ములను ఆప్యాయంగా పలకరించారు. ఆయా లబ్ధిదారులకు వర్తించిన పథకాలను జగ్గిరెడ్డి వారికి వివరిస్తూ ఆ బుక్‌లెట్‌లను అందజేశారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ కులం, మతం, పార్టీ అనే భేదం చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఈ దేశంలో మన సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. చెప్పిన ప్రకారం సామాజిక పింఛను రూ.3 వేలకు పెంచారని, ఈ నెల్లోనే మహిళలకు నాలుగో విడత ఆసరా, చేయూత సొమ్ము జమ చేయనున్నారని తెలిపారు. పేద కుటుంబాలకు ఆర్థిక అవసరాలు తీర్చి వెలుగు తీసుకురావడమే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. జగన్ నాయకత్వంలో మనందరి ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది. వాటిని సద్వినియోగం చేసుకుని అందరూ ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే సీఎం ఆకాంక్ష అని అన్నారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, సర్పంచ్‌లు నెల్లి లక్ష్మీపతిరావు, రెడ్డి చంటి, ఎంపీటీసీ బొక్కా నాగరాణి, జిల్లా ఎస్టీ విభాగం అధ్యక్షుడు కుర్రా శ్రీను, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాకర సర్వేశ్వరరావు, మండల సేవాదళ్ అధ్యక్షుడు జీపీ, ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బిళ్లకుర్రులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

మాట తప్పలేదు.. మడమ తిప్పలేదు..



మామిడికుదురు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

మామిడికుదురు: ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పలేదు, మడమ తిప్పలేదని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. మామిడికుదురు ఎంపీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో రాజోలు నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన పింఛన్లతో పాటు పెంచిన పింఛన్లను ఎమ్మెల్యే వరప్రసాదరావు పంపిణీ చేశారు. ఎంపీపీ కుసుమ వనజకుమారి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే వరప్రసాదరావు మాట్లాడుతూ ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో వెనకడుగు వేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, పార్టీ నేతలు సూరిశెట్టి బాబి, చేట్ల సత్యనారాయణ, ఎండీవై షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు నాయకుల ఆత్మీయ స్వాగతం







వైఎస్సార్ పింఛన్ కానుక కార్యక్రమానికి బుధవారం కాకినాడ విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కొత్తపేట, రాజోలు ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, రాపాక వరప్రసాదరావు, వైఎస్సార్ సీపీ పి.గన్నవరం ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌ను వారు శాలువాతో సత్కరించారు

ఎస్టీయూ మండల సర్వసభ్య సమావేశం



ముక్తేశ్వరంలో జరిగిన సమావేశంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న నాయకులు

అయినవిల్లి: ఎస్టీయూ మండల సర్వసభ్య సమావేశం బుధవారం మండలంలోని ముక్తేశ్వరంలో నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల నుంచి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఎంఈవోలు జేవీ కనకదుర్గ, పి.శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఉపాధ్యాయులు బి.జనార్దనరావు, ఒ.భీమారావు సన్మానం చేశారు. అనంతరం మండల ఎస్టీయూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా గిడ్డి భీముడు, మండల శాఖ అధ్యక్షుడిగా దడాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా పసుపులేటి శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శిగా రామకృష్ణలను ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కాకినాడ వెళ్లి.. పింఛన్ అందజేత



చికిత్స పొందుతున్న దివ్యాంగుడికి పింఛన్ అందిస్తున్న శ్రీలక్ష్మి

పి.గన్నవరం: అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బెల్లంపూడి గ్రామానికి చెందిన దివ్యాంగునికి పింఛన్ సొమ్ము అందించి ఒక మహిళా వలంటీర్ తన మానవత్వాన్ని చాటుకున్నా రు. మండలంలోని బెల్లంపూడికి చెందిన దివ్యాంగుడు తిక్కా నగేష్ కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో తలకు ఆపరేషన్ చేయించుకుని, నెల రోజులుగా అక్కడే చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ గూటం శ్రీలక్ష్మి సొంత ఖర్చులతో బుధవారం కాకినాడకు వెళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నగేష్‌కు రూ.3 వేల పింఛన్ అందించారు. వలంటీర్ శ్రీలక్ష్మిని సర్పంచ్ బండి మహాలక్ష్మి, మహాలక్ష్మి ఫౌండేషన్ సభ్యులు బండి రమేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ జయదేవి, సచివాలయ సిబ్బంది అభినందించారు.

అర్హులంతా ఓటర్లుగా నమోదు కావాలి

పి.గన్నవరం: అర్హతగల యువతీ, యువకులు కొత్త ఓటరుగా నమోదు కావడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పి.గన్నవరం తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ సూచించారు. ఓటరు జాబితాలపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం తన కార్యాలయంలో ఠాగూర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాల్లో వివిధ క్లెయిమ్‌ల పరిష్కార తుది గడువును ఈనెల 12 వరకూ పొడిగించినట్టు వివరించారు. గత అక్టోబర్ 27 నుంచి డిసెంబర్ 9 వరకూ.. కొత్త ఓట్ల కోసం వచ్చిన 5532 దరఖాస్తులను పరిశీలించి 421 దరఖాస్తులను తిరస్కరించి, 5110 దరఖాస్తులను ఆమోదించామని తెలిపారు. అలాగే ఓట్ల తొలగింపుల కోసం 4290 దరఖాస్తులు రాగా, వాటిలో 181 తిరస్కరించామన్నారు. 4088 ఓట్లను తొలగించామన్నారు. ఓట్ల బదిలీ కోసం 2352 దరఖాస్తులు రాగా వాటిలో 72 తిరస్కరించి, 2182 అంగీకరించినట్టు తెలిపారు. వివిధ పార్టీల నాయకులు చెరుకూరి గోపాలకృష్ణ, తోలేటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గౌతమేశ్వరునికి లక్షపత్రి పూజ

అయినవిల్లి: మండలంలోని విలసలో వేంచేసిన పార్వతీ సమేత గౌతమేశ్వరస్వామికి బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లక్షపత్రి పూజ నిర్వహించారు. స్వామికి వేద పండితుల ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రాభిషేకం, సూర్యనమస్కారాలు, శాంతి కల్యాణం, హోమం వంటి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామికి లక్షపత్రి పూజ జరిపారు. ఆలయ చైర్మన్ గురుప్రసాద్ సమక్షంలో ఈ పూజలు జరిపారు. అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రేపటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

అంబాజీపేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రెండో విడత ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు వైద్యాధికారి వి.గౌతమి తెలిపారు. 5న నందంపూడి, 12న పుల్లేటికుర్రు, 19న తొండవరం, 23న ముక్కామల, ఫిబ్రవరి 6న గంగలకుర్రు అగ్రహారం, 13న ఇరుసుమండ, 20న గంగలకుర్రు, 27న కె.పెదపూడి, మార్చి 5న పుల్లేటికుర్రు, మార్చి 12న మాచవరం-4, 18న మాచవరం-1, 26న మొసలపల్లి, ఏప్రిల్ 2న మాచవరం-3, 12న పుల్లేటికుర్రు-2, 16న వక్కలంక, 26న ఇసుకపూడి, మే 3న చిరతపూడి, 10న వాకలగరువు, 24న మాచవరం-2 సచివాలయాల పరిధిలో జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సావిత్రీబాయి జీవితం మహిళలకు ఆదర్శం

- నివాళులర్పించిన మహిళలు, నేతలు



కొత్తపేటలో సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ పెద్దిరాజు



ఆలమూరులో మహిళా ఉపాధ్యాయినిని సత్కరిస్తున్న విద్యాశాఖ ప్రతినిధులు

కొత్తపేట: భారత తొలి మహిళా ఉపాధ్యాయిని, సామాజిక ఉద్యమకారిణి సావిత్రీబాయి పూలే జీవితం మహిళాజాతికి ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులకు ఆదర్శమని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అన్నారు. కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ సీహెచ్ నాగరాణి ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దిరాజు అధ్యక్షత జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ సావిత్రీబాయి సంఘ సంస్కర్తగా స్త్రీలు, స్త్రీల సమస్యలపై స్పందిస్తూ వారి తరఫున పోరాడారన్నారు. ముందుగా సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.సత్యనారాయణ, కె.అంకమరావు, డీసీహెచ్ పాపారావు, డి.నాగదీపిక, నాగశ్రీలక్ష్మి, దీపికాదేవి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: తొలి మహిళా ఉపాధ్యాయినిగా విధులు నిర్వహించి అనేక మందికి ఆదర్శంగా నిలిచిన సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, హెంఈఓలు కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్, హెచ్ఎం కె.సాయిరామ్ అన్నారు. అంబాజీపేట మండల పరిషత్, సొసైటీ కార్యాలయం వద్ద, ఎంఈఓ కార్యాలయాల వద్ద జ్యోతిరావు పూలే సతీమణి సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తొండవరం, అంబాజీపేట జెడ్పీ హైస్కూళ్లలో హెచ్ఎంల ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: సావిత్రీబాయి పూలే జయంతిని బుధవారం మండలంలోని ముంగండ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎస్టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఉన్నత పాఠశాల హెచ్ఎం జి.కనకదుర్గ, ఉపాధ్యాయినులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోరుకొండవారిపేట ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కనకదుర్గను సన్మానించారు. అలాగే పోతవరం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయిని బీహెచ్ వరలక్ష్మిని విద్యార్థులు సత్కరించారు. ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం సావిత్రీబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. వివిధ పాఠశాలల్లో అత్యుత్తమ విద్యాబోధన చేసిన మహిళ ఉపాధ్యాయులను ఎస్టీయూ శాఖ ఘనంగా సత్కరించి మెమెంటోలను బహూకరించింది. ఎస్టీయూ రాష్ట్ర నేత ఎం.రాజగోపాల్, మండల శాఖ అధ్యక్షుడు ఎస్వీ వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శి వి.దుర్గాప్రసాద్, జిల్లా ట్రెజరర్ జీఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: సావిత్రీబాయి పూలే జయంతిని బుధవారం మామిడికుదురులో ఘనంగా నిర్వహించారు. బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక బాలుర, బాలికల వసతి గృహం వద్ద జరిగిన జయంతిలో జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే ఆదర్శ మహిళ అన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు నైనాల రఘురామయ్య, కార్యదర్శి రాయుడు శ్రీను, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెంలో..


రావులపాలెం: స్థానిక డిగ్రీ కళాశాలలో సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వైస్ ప్రిన్సిపాల్ సత్యమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అధ్యాపకులు టి.గంగావతి, ఎ.ఉమ పాల్గొని ప్రసంగించారు. సాంఘిక దురాచారాలను రూపుమాపడంలోను, మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దడంలోను సావిత్రీబాయి సేవలను మరువలేమన్నారు. సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాజోలులో..

రాజోలు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం భారత తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలే జన్మదిన వేడుకలు కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ శైలజ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ చంద్రబోస్, భాస్కరరావు, నల్లి రాజు, షాహిన్, సుజాత, సరిత పాల్గొన్నారు.

పూలే దంపతుల విగ్రహావిష్కరణ

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో బుధవారం సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే, దేశ తొలి మహిళ ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలే విగ్రహాల ఆవిష్కరణ జరిగింది. స్థానిక బీసీ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొని పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జాతి గర్వించదగ్గ ఈ మహనీయుల ఆశయాలను అందరూ నెరవేర్చుదామని ప్రతిన బూనారు.



సంధిపూడిలో పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరించిన గ్రామస్తులు